మినీకథ



# అద్దం

ఎ. శ్రీరామ్

"అబ్బ! వదులు బావా! నెప్పిగా ఉంది."

తలుపు తోసుకొని లోనికి వెళ్ళబోతున్న సౌదామిని చటుక్కున ఆగిపోయింది.

"నీ మొహం! వదలట మేమిటి? కాలు సరిగ్గా చాపు" తన భర్త కంఠం విని స్థాణువులా నిలబడిపోయింది.

ఇదేమిటి? ఏం జరుగుతోంది? తనను ప్రాణాధికంగా చూసుకొనే చెల్లెలు, ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే భర్త..........

"అమ్మో! ....ప్లీజ్! వద్దు బావా వదిలెయ్!"

"అరె! అలా కొట్టుకుంటే ఎలా? కొంచెం సేపు ఓపిక పట్టు".

"అబ్బా! ........"

"ఇలాగయితే లాభం లేదమ్మాయ్! ఎంత సేపు? మరొక్క అయిదు నిమిషాలు."

"ఆ! ....బావా....ప్లీజ్...."

"ఏమిటా కేకలు చిన్నపిల్లలా!....ఎవరయినా వింటే నవ్వుతారు."

"అమ్మో! ఆ నెప్పి భరించలేను బావా! నీకు దణ్ణం పెడతాను.దయచేసి వదిలెయ్."

"కాసేపు నోరు మూసుకో! ఇప్పుడిలా వదిలేస్తే ఏమైనా వుందా ....?"

"ఏమీ కాదులే బావా! ఫర్వాలేదు!"

"అరె! అలా గింజుకుంటే ఎలా? కాలు కాస్త తిన్నగా చాపు."

సౌదామిని మెదడుపై సమ్మెట పోట్లు ప్రారంభమయ్యాయి. ఎంత అమాయకురాలు తను....

తన చెల్లెలు.... ఎంత అమాయకురాల్లా వుండేది. అక్కా! అక్కా అంటూ చెంగు పట్టుకు తిరిగేది. ఇప్పుడు అక్కకే ద్రోహం చెయ్యడానికి తయారయ్యింది.

తన భర్త!....తన నెంత మోసం చేస్తున్నాడు. గుణవంతుడని తనెంతో మురిసిపోయిందే! ఇంత మేకవన్నె పులని కలలో కూడా అనుకోలేదే! ఎంత వంచించాడు!

వాళ్ళను ఎంత గుడ్డిగా నమ్మింది తను! తనకు బస్సు దొరక్క తిరిగి రావడం వల్ల వీళ్ళ బండారం బయటపడింది. ఎన్ని రోజుల్నించి సాగుతుందో ఈ వ్యవహారం? వీళ్ళిద్దర్ని ఏం చేయాలి?....

కోపంతో. కసితో లోపలికు వెళ్ళిన సౌదామిని లోపలిదృశ్యంచూసి నిర్ఘాంతపోయింది. ఎదురుగా....

ముక్కలుగా పగిలి చెల్లాచెదురైన అద్దం!....కాస్త అవతల తన చెల్లెలి కాల్లో గుచ్చుకొన్న గాజు ముక్కను తీయడానికి ప్రయత్నిస్తున్న భర్త....

తెల్లబోయి. నోటమాట రాకుండా చూస్తూ నిలబడిపోయింది సౌదామిని. •